# ఇంటర్వ్యూ



నిజానికి దీన్ని యింటర్వ్యూ అంటానికి వీల్లేదేమో. ఎందుకంటే ప్రత్యేకంగా ప్రశ్నలు వేసే విలేఖరి గాని, సమాధానాలు చెప్పే వి.ఐ.పి. కాని ఇందులో లేరు. అయినా నా దృష్టిలో ఇది ఇంటర్వ్యూయే.

★ ★ ★

రాత్రి తొమ్మిది దాటిందనుకుంటాను. వాడు నన్ను పలకరించినప్పుడు, నాకు చెప్పిన గుర్తుల ప్రకారం సినిమాహాలు అక్కడికి వో వంద గజాలుంటుందేమో.

ఆ చీకట్లోంచి వాడికన్నా వాడి పిలుపే నన్ను ముందు చేరింది.

"వస్తారా.... సార్" అన్నాడు.

వాడు ఎక్కడికి రమ్మంటున్నాడో తెలియనంత అయోమయం లేదు నాలో..... తెల్లారుఝామున

నాలుగింటికి కాని నాకు మద్రాసు రైలు లేదు. అంతవరకు ఏం చెయ్యాలా అనిపించి, అప్పటికే నా ఆలోచన అనేక దార్లలో సాగింది. వాటిల్లో ఈ దారి కూడా ఉంది.

అయినా సంభాషణ సాగటానికి.... "ఎక్కడికి...." అన్నాను.

వాడు బాగా దగ్గరగా వచ్చాడు. చీకట్లో ముఖం పూర్తిగా కనపట్టంలేదు.

"లాడ్జికి సార్.... మంచి రూమ్స్, మడత మంచాలు" అన్నాడు.

"అంతేనా...." అన్నాడు.

"అంతే ఏంటి సార్.... ఏది కావాలంటే అది.... మంచి గరల్స్ రండిసార్ చూద్దురుగాని...." ఓ అడుగు ఎడం పక్కకి వేస్తూ అన్నాడు.

నాలో కుతూహలం వుందికాని, అంతగా కోరికలేదు. అందుకనే గబుక్కుని వాడితో వెళ్ళలేక పోయాను. ఆ పరిస్థితిలో నాకు రైల్వే ప్లాట్‌ఫాం అయినా, సినిమా అయినా లాడ్జి అయినా వొకటే.... ట్రైను టైము వరకూ కాలక్షేపం.

వాడి వెనకాలే వెళ్ళకుండా తప్పించుకోటానికి నేనేం చెయ్యాలో తేల్చుకోటానికి వాడితో కాస్సేపు మాట్లాడక తప్పలేదు. చివరికి ఇద్దరం కలిసి వో వొప్పందం చేసుకున్నాం. వాడికప్పుడు అంతగా పనేం లేదన్నాడు. అందుకని యించుమించు నా ట్రైన్ టైము వరకు వాడు నాతో గడపటం నేను వాడికో రూపాయి ఇవ్వటం.

ముందు యిద్దరం కలిసి సినిమాకు వెడదాం అనుకున్నాం. తీరా హాలు చేరేటప్పటికి టిక్కట్లు లేవు.... కొత్త పిక్చర్ అది. "ఎక్కడేనా కూచుందామా...." అంటే.... "సరే" అన్నాడు.

"ఏ వూరూ...." అనడిగాడు. చెప్పాను.

"కొండమీది కెళ్ళివచ్చారా సార్" అన్నాడు... "మీరేం చేస్తారు...." అన్నాడు. యిలా నా గురించి కొన్ని వివరాలు తెలుసుకున్నాడు. మేమిద్దరం కలిసి కోనేటిగట్టు చేరేలోపల.

కూచున్న కాస్సేపటి కడిగాను, "పేరేమిటని", చెప్పాడు. కృష్ణ వెలుగులో చూశాక తెలిసింది. పదిహేనేళ్ళుంటాయి. పొట్టిగా వున్నాడు. నిక్కరూ, బనీను తప్ప వొంటిమీద చొక్కా లేదు. కుడిచేతికి కాశీ తాడుంది. మెళ్ళో చిన్న దేవుడి బిళ్ళ.

వాడు నన్ను పలకరించిన లాడ్జి పరిసరాల నుంచి మనిషినైతే వచ్చేశాను. కాని అందులో జరిగే విశేషాలు తెలుసుకోవాలన్న ఉబలాటం మటుకు ఆ చీకట్లోనే ఉండిపోయింది. నేను సూటిగా అడిగినా కృష్ణ అన్ని వివరాలు చెప్పేవాడే. కాని నాలోని పెద్దమనిషి లౌక్యం డ్రస్సు వేసుకుని బైటికొచ్చాడు.....

"నీకు యిదంతా ఎలా అలవాటైంది" అన్నాను నెమ్మదిగా.

"ఏదంతా.... సార్" అన్నాడు కృష్ణ.

"అదే ఇలా పిలవటం.... అమ్మాయిలు...." నాలో పెద్దమనిషి నసిగాడు...

"అదా.... అదంతా పెద్ద కథలెండి.... ఇప్పుడు మొదలెడితే తొందరగా అవదు మీకు బోర్ కొడుతుందేమో....." అన్నాడు.

నేను ఫరవాలేదని భరోసా యిచ్చాను. కృష్ణ చెప్పటం మొదలెట్టాడు. తను చెప్పిన దానికి ఓ క్రమంలేదు.... చాలాసేపు చెప్పాడు.... వాడు చెప్పిన దానిలో...... వాడి కథకి సంబంధం ఉన్నవీ, లేనివీ

కూడా ఉన్నాయి.

కృష్ణ చెప్పిందంతా అక్షరాలా నిజం కాకపోవచ్చు. దానిలో గొప్ప చెప్పుకోవటంతోపాటు కల్పించి ఆ వయసుకి వాడు చెప్పలేని నిజాలు, సిసలైన జీవితం ఉన్నాయనిపించింది. వాడు చెప్పిన కథ.....

★ ★ ★

ఎదురుగా వున్న కిళ్ళీ కొట్లోంచి నాకు సిగరెట్లు, వాడికి బీడీలు తేవటానికి వెళ్ళాడు కృష్ణ. నేను చుట్టూ చూశాను. జనం రద్దీ అంతగా లేదు. కొంచెం దూరంలో కోనేటి మెట్ల మీద నలుగురైదుగురు ముష్టివాళ్ళనుకుంటా కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

నేను సిగరెట్టు వెలిగిస్తే..... నాతోబాటు తనూ బీడీ వెలిగించి రెండు దమ్ములాగి మొదలెట్టాడు.

"ఆరోజు మా థర్డ్‌ఫాం పరీక్షలు అయిపోయాయి సార్..... ప్రతి యేడాది లాగే ఎంతో హుషారుగా యింటికొచ్చాను. అమ్మ ఏడవటంలేదు కాని ఎందుకో దిగాలుగా వుంది. నాన్న అన్నం తింటున్నాడు. ఏదో పోట్లాట జరిగుంటుందనుకున్నాను.... మా యింట్లో మామూలే అది.

కాని మూడో నాటిక్కాని అమ్మ దిగులుకి కారణం తెలియలేదు. నాకు చద్దన్నం పెడుతూ నెమ్మదిగా అంది..... "నిన్ను పనిలో పెడతానంటున్నాడు...." అని. నాకు ఆరోజు వెంకన్నగారి మామిడితోటలో ఆటల హడావిడి వుంది.... ఆరోజు కాకుండా ఆ మర్నాటి నుంచి ఏం జరిగినా ఫరవాలేదనిపించింది. అంతేకాని నా చదువు అక్కడితో నాన్న ఆపేస్తున్నాడని నాకు తోచలేదప్పుడు. మా వూళ్ళో హైస్కూల్లేదు.... వుంటే నాన్న మనసు ఎలా వుండేదో....

నేనింకా చెయ్యి కడుక్కోక ముందే నాన్నొచ్చాడు. "చెప్పావా ఆడితో...." అన్నాడు. అమ్మ నెమ్మదిగా తలూపింది. "నడవరా...." అన్నాడు నేను లేవగానే. నాన్నంటే అసలే నాకు భయం. అందులో చిరుబురు మీదున్నాడు. మాట్టాడకుండా బైలుదేరాను. నాన్న వెనకాల నడుస్తున్నంతసేపూ వెంకన్నగారి తోటలో ఆటలకి పోలేకపోయానే అని తప్ప ఇంకో గొడవలేదు సార్ నాకు.

మావూరి పెద్దిరెడ్డిగారి కమతంలో వుంటున్నాడు మా నాన్న.... నన్ను కూడా రెడ్డిగారింటికి తీసికెళ్ళేటప్పటికి నన్ను అళ్ళ దగ్గరే పనిలో చేరుస్తాడనిపించింది.

మేం వెళ్ళిన అరగంటక్కాని రెడ్డిగారు మాతో మాట్లాడలేదు..... నాన్న ఏదేదో చెప్పాడు.... నా మనసు ఆటిమీద లేదు. కొన్ని కొన్ని వినపడ్డాయి.

"ఏదో యింక మీదే భారం" అన్నాడు నాన్న చివరికి....

"ఇంత కుర్రాడు పొలం పన్లేం చేస్తాడ్రా... కొన్నాళ్ళు మా యింట్లోనే వుండనీ పురిటికి అమ్మాయొచ్చింది కదా. పని కూడా వుంది" అన్నారు రెడ్డిగారు.

కృష్ణ బీడీ ఆఖరి దమ్ములాగి పారేస్తూ కాస్సేపు ఆగాడు. "ఏం సార్.... బోర్ కొట్టటంలే...." అన్నాడు. నేను "చెప్పు చెప్పు" అన్నాక తిరిగి మొదలెట్టాడు.

పని చెయ్యటం కొత్తగా వున్నా, నాన్న తిడతాడని ఎలాగో లాగ వారంరోజులు గడిపాను. ఆ తరవాతే మొదలైంది గొడవ. నూతి నీళ్ళు తోడ్టం, యిళ్ళూడవటం.... గిన్నెలు కడగటం.... బజారు పనులు చూట్టం, యివన్నీ చేసేవాణ్ణి, గుడ్డలు కూడా వుతికేవాణ్ణి.... కాని ఆరోజు రెడ్డిగారమ్మాయి చంటిపిల్ల పీతిబట్టలు వేస్తే చిరాకేసింది. అవి పక్కకి తీసేసి మిగిలిన పనంతా చేశాను.

ఆవిడ చూసింది..... "ఫరవాలేదు. మిగిలిన గుడ్డల్లాగే అవీ వుతికేయి. చీపురిస్తా.... చేత్తో

ముట్టుకోనక్ఖర్లేదంది...." 'నాకు అసహ్యం' అన్నాను... అంతే అదే గొడవకి మొదలు.

రెడ్డిగారొచ్చాక చెప్పారు.

"ఏంటిరా గుడ్డలుతకనన్నావట...." అన్నారు.

చెప్పాను. విన్నారో లేదో మరి. వూరికే తిట్లు మొదలెట్టారు. తిట్టి తిట్టి.... "వుతుకుతావా.... వుతుకవా..." అన్నారు.

"వుతకనంటల్లా.... కాని అసహ్యం అంటున్నా....." అన్నా.

"ఇంతోటి బోడి చదువుకీ.... యింత షోకా..... గుడ్డలుతకటం అసహ్యవా...." అంటూ చెయ్యి విసిరారు.

నేను అనుకోలేదు... చెంప మంటెక్కింది. ఇంక నన్నేం చెప్పనిచ్చేలా లేరు ఆయన. బాగా తంతారనో, ఏంటో నాకు తెలియని భయం వేసింది. పక్కనే చేతికేదో రాయి అందితే అది గట్టిగా విసిరేసి పరిగెత్తాను. రెడ్డిగారు అరుస్తున్నారు.

ఆ వీధి దాటకముందే, వెనకాలే పరిగెత్తుకొచ్చిన రెడ్డిగారి మనిషి నన్ను వెనక్కి తీసికెళ్ళాడు. సావిట్లో గుంజకి కట్టేశారు. మళ్ళీ కొడతాడేమో అనుకున్నాను.... కొట్టలేదు...." అని ఆగాడు కృష్ణ.

కృష్ణ చెపుతున్నది యింటరెస్టింగా వున్నా. నాకు ప్రయాణం బడలిక వల్ల నిద్దరమత్తుగా వుంది. "దగ్గర ఎక్కడేనా టీ దొరుకుతుందా...." అన్నాను.

దొరుకుతుందని లేచాడు. మేం యిద్దరం టీకి వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చేలోపల యింకా కొంత కథ చెప్పాడు కృష్ణ. అది చిన్నసైజు ఎడ్వెంచర్‌లా వింటానికి బాగానే వున్నా, పూర్తి నిజంలా అనిపించలేదు నాకు.

రెడ్డిగారు తనని పోలీసుల కప్పజెప్పారని..... తీసికెళ్ళి జైల్లో పెట్టారని.... జైల్లో యింకా కొందరు కుర్రాళ్ళుంటే అందరూ కలిసి బ్రహ్మాండంగా ప్లాన్ వేసి పోలీసుల్ని మోసం చేసి తప్పించుకు పారిపోయామని చెప్పాడు.

మొత్తానికి జరిగిందేమిటంటే వాళ్ళ వూరు నుంచి పారిపోయి ఆ మర్నాటికి రాజమండ్రి రైల్వేస్టేషను చేరాడు కృష్ణ. పారిపోవటానికి ముఖ్య కారణం తండ్రి తంతాడని, తన్ని మళ్ళీ రెడ్డిగారింట్లోనే పనికి పెడతాడని భయం. కృష్ణ ఎందుకు పారిపోయి వచ్చాడన్న విషయం ఖచ్చితంగా తెలిశాక, ఎలా పారిపోయి వచ్చిందీ అంత ముఖ్యం అనిపించలేదు నాకు. అందుకని ఏదోటి చెప్పాళ్ళే అని వూరుకున్నాను.

తిరిగి మేం కోనేటిగట్టున బైఠాయించే లోపల అనవసరంగా రెడ్డిగారు తనని కొట్టినప్పుడు, తను తిరిగి కొట్టటంలో తప్పేమిటో చెప్పమని.... ఓ ప్రశ్న కూడా వేశాడు కృష్ణ.

నాకేం చెప్పాలో తోచక నెమ్మదిగా ఆ విషయం దాటేసి.... "రాజమండ్రి స్టేషన్ నుంచి ఏం చేశావు...." అనడిగాను.

"స్టేషన్ కొచ్చిందగ్గర నుంచి రైలు ఎప్పుడొస్తుందా అని చూశాను.... నాన్న వాళ్ళెవరేనా వస్తారేమో అన్న భయం ఓ పక్క.... ఓ గంటకి మద్రాసు మెయిలొచ్చింది. గబుక్కున ఎక్కి కూచున్నాను. ఏలూరొచ్చేవరకూ ధీమాగానే ఉంది. ఏలూరులో బండి కదిలి వెడుతుంటే ప్లాట్‌ఫాం మీద ఓ టికట్ కలెక్టర్ కనపడ్డాడు. అంతవరకూ నాన్న భయమే.... అప్పటి నుంచి టికట్ భయం కూడా పట్టుకుంది. బెజవాడలో దిగి ఏం చెయ్యాలా అని చూస్తుంటే నాలాంటోడే ఇంకోడు కలిశాడు.... వాడూ టికట్

కొనలా.... కాని వాడి దగ్గర డబ్బుంది. అంతగా అయితే నేనిస్తాలే డబ్బు అని భరోసా యిచ్చాడు. ఇడ్లీ తింటూ నాకూ కొనిపెట్టాడు. అంతవరకూ ఆకలి వెయ్యలేదు.... భయం తప్ప. యిడ్లీ తింటుంటే తెలిసింది ఆకలి. యిద్దరం మళ్ళీ మెయిలెక్కి మద్రాసు చేరాం.

"ఆ కుర్రాడి దేవూరు... వాడెందుకు యింటి నుంచి పారిపోయొచ్చాడు.... వాడి దగ్గర అంత డబ్బెక్కడిది...." అన్న వివరాలు తెలుసుకుందామని నేను కొంచెం ప్రయత్నం చేశాను. కాని కృష్ణ ఆ విషయాల మీద అంత శ్రద్ధ చూపిపంచలేదు. ఆ కుర్రాడి కథకన్నా ముందు, తన కథ చెప్పాలన్న ఉత్సాహమే దానిక్కారణం కావచ్చు. అందుకని ఆ కుర్రాడి గొడవ వొదిలిపెట్టి తర్వాత ఏమైందో చెప్పమన్నాను.

"మద్రాసులో వోరోజంతా వాడూ, నేనూ కలిసి తిరిగాం. వాడిది మద్రాసు దగ్గర్లో ఏదో వూరుట. పేరేదో చెప్పాడు. నాకిప్పుడు గుర్తులేదు.... సాయంత్రం మావూరెళ్ళి పోతానన్నాడు.... నాకేమనాలో తోచలేదు. సరే అన్నాను. నాకు వో రూపాయిచ్చి బస్సెక్కేశాడు. ఆ రూపాయితో మర్నాడంతా గడిపాను. ఎవర్నైనా పని అడిగి చెయ్యాలనిపించింది. అడుగుదామంటే ఎవరూ తెలుగు మాట్లాట్టంలేదు... యింక యిలా కాదనిపించింది. తెలుగు మాట్లాడే వూరెడితేనే కాని లాభంలేదని తిన్నగా తిరుపతి బండెక్కి యిక్కడికి చేరాను.... అది సార్ కథ...." అన్నాడు నవ్వుతూ.

కృష్ణ తిరుపతే ఎందుకొచ్చాడో.... తెలుగు మాట్లాడే వూరు కావాలంటే ఏ నెల్లూరో ఎందుకు వెళ్ళలేదో అన్న అనుమానం వచ్చి అడిగాను.

ఇక్కడ వచ్చీపోయే జనం ఎక్కువ కదా సార్.... ఏదేనా పని తొందరగా దొరుకుతుందని పించింది...." అన్నాడు.

ఇంకేమేనా చెపుతాడేమో అని చూశాను. బీడీ వెలిగించి దమ్ము లాగడం తప్ప తన కథ అయిపోయినట్లే కూచున్నాడు.

"ఇంతకీ అసలు నేనడిగింది చెప్పనే లేదు" అన్నాను మరికాస్సేపు చూసి...

"అదా సార్.... నెమ్మదిగా యిక్కడికొచ్చాకే అలవాటైంది. ముందు అదిగో చూడండి బస్‌స్టాండ్ దగ్గర హోటళ్ళు లేవు. వాటిలో పనిస్తారేమో అని అడిగాను. ఇక్కడ ఒక్క తెలుగు హోటలూ లేదు.... అన్నీ అరవవాళ్ళవే.... వాళ్ళ కుర్రాళ్ళు వాళ్ళకున్నారు. ఏం చెయ్యాలా.... అని ఆలోచించాను..... నా వయసు కుర్రాళ్ళు ఏం చేస్తున్నారు అని చూశాను. చాలామంది బస్‌స్టాండ్‌లో కూలీమోస్తూ కనిపించారు. ఓ పక్కన ఆకలి.... డబ్బుల్లేవు... నెమ్మదిగా ఒకాయన్ని...."బేగ్" తీసుకురానా" అనడిగాను. సరే నన్నాడు. కొత్త సత్రందాకా మోశాను. పావలా యిచ్చాడు.... అంతే వెంటనే పరుగెత్తుకెళ్లి సాంబార్ ఇడ్లీ కొట్టేశాను. అంతకుముందు రోజంతా పస్తేమో.... భలే ఆత్రంగా తిన్నాను..." అన్నాడు. అంటూ నవ్వాడు... ఆ నవ్వు నాకు పూర్తిగా కనపళ్ళేదు.... కాని అందులో అప్పటి దిగులు, బాధ ఉండే ఉంటాయి.

"ఇది బాగానే ఉందనుకున్నాను... కానీ ఇక్కడ కూలీ మొయ్యటంలో చాలా గొడవలున్నాయి. బస్‌స్టాండ్‌లోకి వెళ్ళి కూలీ అడగబోతే నా వయసు కుర్రాడే.... "పోరా.... అవతలికి పో...." అనరిచాడు. దేవస్థానం బస్‌స్టాండ్‌లో కూలీ వాళ్ళందరికీ ఓ జట్టుంది. వాళ్ళలో కొత్తవాళ్ళని చేరనివ్వరు. చేరాలంటే వాళ్ళకి కొంత డబ్బివ్వాలి. వాళ్ళకి అణిగిమణిగి ఉండాలి. ప్రతినెలా యివ్వాల్సిన మామూళ్ళున్నాయి.

అందుకనే కూలి పెద్ద గిట్టుబాటుగా వుండేది కాదు నాకు. బస్‌స్టాండ్ బైట కూలీ దొరికేదే

తక్కువ.... అలాగే రోజులు గడుపుతుంటే వోరోజు వో పాసింజర్ సామాను యిందాకా మీరు చూశారే లాడ్జి అక్కడికి తీసుకెళ్ళాను. అప్పణ్ణించి యిది మొదలైంది. నేను సామాను దింపి వస్తుంటే చూశాను.... ఓ గదిలో ఆడాళ్ళు లైనుగా నిలబడున్నారు. ఆయనెవరో కూచుని వాళ్లందర్నీ చూస్తున్నాడు. నాకదేమిటో తెలియక నిలబడి చూస్తుంటే హోటలు మేనేజరొచ్చి తీసికెళ్ళాడు. నెమ్మదిగా ఆయనే చెప్పాడు. పాసింజర్లనెలా పిలవాలో, పిలిస్తే ఎంత కమీషన్ యిచ్చేదీ.... నేను పెద్ద పెద్ద బరువులు మొయ్యలేను. అందుకని ఈ పని అలవాటు చేసుకున్నా. అంతకు ముందు రంగడు ఆ లాడ్జింగులో యిదే పని చేసేవాడు. వాడు రూమ్‌బాయ్ అయ్యాక పూర్తి గిరాకీ. అంతా నాదే అయింది...." అన్నాడు.

"ఇలా యివన్నీ నువ్వు నేర్చుకోటానికి ఎన్నాళ్ళు పట్టింది" అన్నాను.

"నేర్చుకోటానికేముంది సార్.... అంతా అదే అలవాటైపోయింది. కాని రోజుకి రెండూ మూడూ సంపాదన ఆర్నెల్ల వరకు రాలేదు." అన్నాడు. ఇంకా తన సంపాదన గురించి వివరాలు తనుండే బస.... యిలా ఏవేవో చెప్పాడు.

ఆర్నెల్లు ఆ చిన్న వయసులో అన్ని తిప్పలుపడ్డా, కృష్ణ వాటిని నవ్వుతూ చెప్పడమే నాకు ఆశ్చర్యమనిపించింది. తనలాంటి వాళ్ళని అక్కడ యింకా చాలామందిని చూట్టంవల్ల అదేమంత పెద్ద బాధగా తోచలేదేమో....

"ఇల్లు.... అమ్మ.... నాన్న.... ఎప్పుడూ గుర్తుకు రావటం లేదూ....?" అనడిగాను.

"ఎందుకు రావు సార్.... అమ్మ గుర్తొస్తుంది ఎక్కువగా.... కాని అక్కడికెళ్ళాలనిపించదు. ఆ రెడ్డిగారింట్లో పనికన్నా యిదే బావుంది. అక్కడికెడితే నాన్న వూరుకోడు. అందుకని ప్రతినెలా అమ్మకి మనియార్డరు పంపుతా....

"అలా అయితే మీనాన్న నిన్ను వెతుక్కుంటూ రాడు యిక్కడికి" అన్నాను.

"ఒక్కోసారి ఒకోవూరు నుంచి పంపుతున్నా సార్... అయినా మా నాన్నకంత ఓపికెక్కడిది.... అమ్మని తన్ని ఆ డబ్బు లాక్కెళ్ళి తాగేస్తాడు. అమ్మకి నేను కులాసాగా వున్నాని తెలిస్తే చాలు. అంతే."

"ఎన్నాళ్ళిలా....." అన్నాను.

"ఇంక ఎన్నాళ్ళో అఖ్ఖర్లేదు సార్.... యింకో రెండు మూడేళ్ళు.... మొన్న ఆర్నెల్ల క్రితం గుంటూరు నుంచి ఓ ఆఫీసరొచ్చారు. నాకు నేవీలో ఉద్యోగం ఇప్పిస్తానన్నారు. అదేదో వయసు చాలదట.... అందుకని ఓ రెండేళ్ళు పోయాక తనకి ఉత్తరం రాయమన్నారు.... ఎడ్రసు కూడా యిచ్చారు.... నేవీలో ఉద్యోగం బావుంటుంది కదు సార్...." అన్నాడు.

వాడు చెప్పటం పూర్తయ్యేప్పటికి ఒంటి గంటయ్యింది. యింక మేం లేద్దామనుకుంటుంటే వొకతను మా దగ్గరకొచ్చాడు.

"ఏ ఊరు సార్ మీది...." అన్నాడు.

నేను చెప్పకముందే కృష్ణ చెప్పాడు.

"ఏం...." అనడిగాను.

"ఏం లేదు సార్.... మీరు మరోలా అనుకోకపోతే నేను చెప్పేది వినండి. చాలా రాత్రయింది... వీడి సంగతి యిక్కడ అందరికీ తెలుసు. ఏ పోలీసేనా చూస్తే లేనిపోని గొడవ చేస్తాడు.... అందుకని వెళ్ళి ఏ సత్రవలోనైనా కూచోండి...." అన్నాడు.

అది విని కృష్ణ నవ్వి.... "రండి సార్...." అన్నాడు. ఇద్దరం మరో టీ తాగి సత్రం అరుగు చేరాం.... నా బాగ్ సత్రం క్లోక్‌రూంలో వుంది. ఇంకో గంటసేపు నాతో కబుర్లు చెప్పాడు కృష్ణ.

ఆ గంటలో చాలావాటి గురించి అడిగాడు. అయిదేళ్ళ కొకసారి జరిగే ఎన్నికలు. ఈసారి ముందే ఎందుకు జరిగాయి అన్నాడు.... నేవీలో జీతం ఎంతొస్తుందన్నాడు. ఓడలు బావుంటాయి కదూ.... అన్నాడు. ఇలాగే అక్కడ తన వయసు కుర్రాళ్ళ గురించి.... కూలీమోసే వాళ్ళలో పెద్ద కుర్రాళ్ళు అడుక్కునే ఆడాళ్ళ దగ్గరికి వెళ్ళే సెక్స్‌లైఫ్ గురించి, ముష్టాళ్ళ సంపాదన గురించి, తన ఆదాయం గురించి మాట్లాడాడు. రెండున్నర అవుతుంటే నా అడ్రసు కూడా తీసుకుని.... "వెళ్తానని..... మళ్ళీ వచ్చినప్పుడు తనని గుర్తుంచుకోమని...." చెప్పి వెళ్లాడు.

నేను నా బాగ్ తీసుకుని స్టేషన్‌వేపు వెడుతుంటే అనిపించింది. అందరి కుర్రాళ్ళలాగే కృష్ణకీ తెలివితేటలున్నాయి. విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి వుంది.... జీవితంలో స్థిరపడాలన్న కోరికుంది... కానీ అవకాశమే లేదు, ఎవరో గుంటూరు నుంచి వచ్చినాయన యిచ్చిన ఎడ్రసు ఆధారంగా ఎన్నో కలలు కంటున్నాడు. కృష్ణలాగే యింకా ఎంతమంది అలా కలలు కంటున్నారో....

ప్రత్యేకించి కృష్ణో, కృష్ణలాంటి యింకో కుర్రాడితోనో పనిగట్టుకుని కొన్ని గంటలు కబుర్లు చెపితే కాని, వాళ్ళ విషయాలు నాలాంటి వాళ్ళకి తెలిసే అవకాశం లేదు.

స్టేషన్‌లో బెంచీ మీద నిన్నటి పేపరు పరుచుకు కూచుంటుంటే.... 'అధికారాన్ని, హోదాని, గ్లామర్ని యింటర్వ్యూ చెయ్యటానికి అలవాటుపడ్డ పత్రికలు... జీవితాన్ని కూడా యింటర్వ్యూ చేస్తే బాగుణ్ణు...' అనిపించింది.

*• ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, 8-6-1973*